

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0

జోరుగా వేరుశనగ సాగు



ట్రాక్టర్ సాయంతో విత్తనాలు వేస్తున్న దృశ్యం

అచ్చంపేట/వెల్దండ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో వేరుశనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ ఏడాది జిల్లాలో 1,24,555 ఎకరాలలో వేరుశనగ సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వేరుశనగ సాగుకు అక్టోబరు రెండోవారం నుంచి నవంబరు రెండో వారం వరకు అనువైన సీజన్ కావడంతో రైతులు జిల్లాలో వేరుశనగ పనుల్లో నిమగ్నమయ్యారు. వేరుశనగ సాగులో పెట్టుబడి భారీగా పెరిగిందని రైతులు వాపోతున్నారు. ఒక ఎకరం సాగుకు దుక్కులు సిద్ధం చేసిన నాటి నుంచి పంట నూర్పిడి వరకు రూ.30వేల నుంచి 40వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం అనుకూలించి పంట దిగుబడి బాగా వచ్చి మార్కెట్‌లో డిమాండ్ ఉంటేనే లాభాలు వస్తాయని, వాతావరణం అనుకూలించకపోతే అప్పులపాలయ్యే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

యంత్రాలతో సులభం

వేరుశనగ సాగులో కూలీల కొరతను అధిగమించేందుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. విత్తనాలు వేయడంతో పాటు పంట నూర్పిడి చేసేందుకు యంత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగేచేసేందుకు స్ప్రింక్లర్లు వినియోగిస్తున్నారు. కేవలం పంటను పొలంనుంచి తీసేందుకే కూలీలు అవసరం ఉంటుంది.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి వస్తుంది. రైతులు విత్తనాలు విత్తే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలి. ఎకరానికి 60నుంచి 75కిలోల విత్తనాలను అవసరం ఉంటుంది. కలుపు నివారణ కోసం విత్తనాలు విత్తిన 2-3 రోజుల లోపల పెండి మిథాలిన్ మందును పిచికారి చేసుకోవాలి. 21రోజుల తర్వాత ఇమాజితఫైర్ పిచికారి చేసుకుంటే కలుపు నివారించవచ్చు. దీంతో కలుపుతీత ఖర్చులు మిగులుతాయి. 45రోజుల తర్వాత ఎకరాకు 200కిలోల జిప్సం చల్లితే గింజలో నూనె శాతం పెరిగే అవకాశం ఉంటుంది.

- మంజుల ఏవో, కల్వకుర్తి

అగ్రిమెంట్లు కావట్లే..



మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డుకు వచ్చిన ధాన్యం (ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో ధాన్యం దిగుమతికి రైస్‌మిల్లర్ల ససేమిరా
- సన్నధాన్యం ఆడిస్తే నష్టపరిహారం కోసం మిల్లర్ల డిమాండ్
- ముంచుకొస్తున్న సేకరణ.. పలుచోట్ల కేంద్రాలు ప్రారంభం
- అన్ని జిల్లాల్లో కలిపి 13.11 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం
- సీఎంఆర్ ఇవ్వని రైస్‌మిల్లర్లు.. ఈ నెలాఖరు వరకు గడువు

ఉమ్మడి పాల మూరు జిల్లాలో ఇప్పటివరకు మిల్లర్లతో అగ్రిమెంట్లు పూర్తికావడం లేదు. ఈసారి ప్రభుత్వం సన్న ధాన్యంపై రూ. 500 బోనస్ ఎంఎస్ పీపైన అందజేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.. గతంలో సన్నధాన్యాన్ని ముందుగానే చాలా మంది రైతులు మిల్ల ర్లకు, ప్రైవేటు వ్యాపారులకు విక్రయించే వారు.. కానీ ఈసారి బోనస్ ప్రకటనతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తే తాము ధాన్యం తీసుకోవడానికి సిద్ధమని ప్రకటిస్తున్నారు. ఆ దిశగా చర్చలు సఫలం కాలేదు. అందువల్లనే పౌరసరఫరాల శాఖతో ఒప్పందాలు చేసుకోవడానికి మిల్లర్లు ముందుకు రావడం లేదనేది స్పష్టమవుతోంది.

మహబూబ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలం ధాన్యం సేకరణ ప్రారంభం కాబోతోంది. ఇప్పటికే ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలుచోట్ల ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. కాలువల కింద పంటలు వేయడంతో ధాన్యం కొంత ఆలస్యంగానే చేతికి వస్తుంది. రైతులు కల్లాలకు ధాన్యం తీసుకువచ్చే సమయానికి కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసుకోవడం, గన్నీ బ్యాగులు, రవాణా ఏర్పాట్లు చేసుకోవడం, మిల్లర్లతో ధాన్యం దిగుమతికి సంబంధించిన అగ్రిమెంట్లు చేసుకోవడం వంటివి ఇప్పటికే పూర్తికావాలి. కానీ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటివ రకు మిల్లర్లతో అగ్రిమెంట్లు పూర్తికావడం లేదు. ఈసారి ప్రభుత్వం సన్నధాన్యంపై రూ. 500 బోనస్ ఎంఎస్ పీపైన అందజేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.. గతంలో సన్నధాన్యాన్ని ముందుగానే చాలా మంది రైతులు మిల్లర్లకు, ప్రైవేటు వ్యాపారులకు విక్రయించే వారు.. కానీ ఈసారి బోనస్ ప్రకటనతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించే అవకాశం ఉంది. మిల్లర్లు మాత్రం తాము సన్నధాన్యం ఆడిస్తే.. బియ్యం తక్కువగా వస్తాయని, ప్రభుత్వం నిర్దేశించిన 67 కిలోలు ఇవ్వడం సాధ్యం కాదని చెబుతున్నారు. గరిష్ఠంగా 60 కిలోలు ఇవ్వడం కుదురుతుందని స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తే తాము ధాన్యం తీసుకోవడానికి సిద్ధమని ప్రకటిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ దిశగా చర్చలు సఫలం కాలేదు. అందువల్లనే పౌరసరఫరాల శాఖతో ఒప్పందాలు చేసుకోవడానికి మిల్లర్లు ముందుకు రావడం లేదనేది స్పష్టమవుతోంది. ధాన్యం కల్లాల్లోకి వచ్చేటప్పటికీ ఈ అగ్రిమెంట్లు పూర్తికాకపోతే రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తరలించడానికి ఇబ్బందులు ఏర్పడనున్నాయి.

● ఉమ్మడి జిల్లాలో మిల్లులు, ధాన్యం సేకరణ లక్ష్యం (టన్నుల్లో)...

జిల్లా	మిల్లుల సంఖ్య	దొడ్డురకాలు	సన్నరకాలు	మొత్తం
మహబూబ్‌నగర్	74	22,195	1,76,855	1,99,050
వనపర్తి	186	86,374	3,13,626	4,00,000
జోగుళాంబ గద్వాల	58	44,000	96,000	1,40,000
నాగర్‌కర్నూలు	73	20,000	2,00,000	2,20,000
నారాయణపేట	60	1,89,390	1,63,197	3,52,587

13.11 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ వానాకాలంలో 13.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సన్నధాన్యం వాటానే దాదాపు 80శాతం పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రక టించడంతో ఈసారి కొంత ఎక్కువగానే రైతులు సన్నాల సాగుపై ఆసక్తి చూపించారు. సాధారణంగా గడిచిన కొన్నేళ్లుగా క్వింటా దొడ్డు ధాన్యాన్ని మిల్లర్‌కు ఇస్తే 67 కిలోల వరకు బియ్యం మిల్లర్ తిరిగి అప్పగించాలి. అయితే సన్నధాన్యం విషయంలో అలా కుదరదని మిల్లర్లు చెబుతున్నారు. సన్నాలు

● మిగతా 7వ పేజీలో...

అవినీతి కంపు

- తవ్వేకొద్దీ వెలుగులోకి అక్రమాలు
- వేతనాల దారి మళ్లింపుపై ముగ్గురు కమిషనర్లకు నోటీసులు



నాగర్‌కర్నూల్ మునిసిపల్ కార్యాలయం

నాగర్‌కర్నూల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కందనూలు మునిసిపాలిటీలో అవినీతి కంపు కొడుతోంది. తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల దారి మళ్లింపు, మునిసిపాలిటీ వాహనాల నిర్వహణకు డీజిల్ కొనుగోలు, మరమ్మతు పేరిట అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల విషయంలోనే మునిసిపల్‌లో ఇద్దరు శాశ్వత, తాత్కాలిక ఉద్యోగి ఒకరు గూడుపుఠాణీ నడిపి దాదాపు కోటి రూపాయలకు పైగా నిధులు బొక్కిన విషయం తెలిసిందే. తాజాగా సమాధుల శుభ్రం పేరిట రూ.1.50 లక్షలు చెల్లించేందుకు రంగం సిద్ధం చేస్తున్న విషయం చర్చనీయాంశంగా మారింది.

ముగ్గురు కమిషనర్లకు షోకాజ్ నోటీసులు

మునిసిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన వేతనాలు దాదాపు రూ.కోటికి పైగా కుంభకోణం జరిగిన విషయంలో ముగ్గురు కమిషనర్లకు షోకాజ్ నోటీసులు అందాయి. గడిచిన నాలుగేళ్ల నుంచి ఈ తతంగమంతా గుట్టు చప్పుడు కాకుండా నడుస్తోంది. గైర్హాజరైన అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలను కట్ చేసి ఆ నిధులను తన సొంత ఖాతాకు మళ్లించారు. ఈ విషయం మెప్మాలో పని చేసే ఓ మహిళకు బ్యాంకు ఉద్యోగుల ద్వారా తెలియడంతో అసలు బండారం బయటపడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు నాలుగేళ్లుగా జరుగుతున్న చెల్లింపుల వివరాలు ఆరా తీశారు. అక్రమాలు వాస్తవమని తెలియడంతో కలెక్టర్‌తో పాటు మునిసిపల్ ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక పంపించారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల చెల్లింపు విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన జరపని ముగ్గురు కమిషనర్లకు షోకాజ్ నోటీసులు పంపించారు.

సమాధుల శుభ్రం పేరిట రూ.1.50 లక్షలు

తాజాగా మునిసిపాలిటీలో చోటు చేసుకున్న మరో ఉదాంతం హాస్యాస్పదంగా ఉంది. వివిధ వర్గాలను ఆకట్టుకునేందుకు పండుగలు, పబ్బాల పేరిట మునిసిపల్ నిధులను దుబారా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మునిసిపల్ సిబ్బందిని వినియోగించి ఏర్పాట్లు చేయవచ్చు. కానీ నిధులను కూడా వెచ్చించడం పట్ల వివిధ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల ఒక వర్గానికి చెందిన సమాధులను శుభ్రం చేయడానికి రూ.1.50 లక్షలు బిల్లు చెల్లించాలని మునిసిపాలిటీలో ప్రతిపాదనలు పెట్టడం పట్ల కొందరు కౌన్సిలర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇందులో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు కూడా ఉన్నారు. సమాధులు శుభ్రం చేయడానికి నాగర్ కర్నూల్ గ్రామ పంచాయతీ, నగర పంచాయతీ, మునిసిపాలిటీగా ఉన్నప్పటి నుంచి నయాపైసా వెచ్చించలేదు. కొత్తగా సమాధుల శుభ్రం పేరిట బిల్లు పెట్టడంపై ఆగ్రహం వ్యక్త మవుతోంది. ఇలా ఒక్కో వర్గం ముందుకొస్తే నిధు లు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నిస్తున్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

● కలెక్టర్ ఆదర్శ్ సురభి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్‌లో రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు, మునిసిపల్ కమిషనర్‌తో పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. మదనాపూర్ వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ ఇంజనీరును ఆదేశించారు. కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో వసతి గృహాల ఏర్పాటుకు సంబంధించిన మరమ్మతు పనులు త్వరగా పూర్తి కావాలన్నారు. ప్రభుత్వ స్థలం, అటవీ శాఖ భూమి పోను మిగిలిన 19 ఎకరాల భూ సేకరణ చేసేందుకు సూచనలు చేశారు. వనపర్తి పట్టణంలోని రహదారుల విస్తరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాన్‌గల్ రోడ్డు విస్తరణకు సంబంధించి భూ సేకరణపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలు చేసిన వారికి నోటీసులు జారీ చేయాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. వనపర్తి పెబ్బేరు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం

ఇంటర్వ్యూ

- జిల్లా పంచాయతీ అధికారి శ్యామ్‌సుందర్



డీపీవో శ్యామ్‌సుందర్

గద్వాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీలలో శుభ్రత, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డీపీవో శ్యామ్‌సుందర్ అన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరాలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని, ప్రత్యేకాధికారుల సహకారంతో గ్రామ పాలన పకడ్బంధీగా నిర్వహిస్తున్నామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

శుభ్రతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించి బ్లీచింగ్ వేసి నీటిని సరఫరా చేయిస్తున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం.

పంచాయతీలలో నిధులు కొరత ఉందా?

రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు రూ.2.82 కోట్లు విడుదల చేసింది. ఇందులో నుంచి మల్టీవర్కర్ల జీతాలు, ట్రాక్టర్ల ఈఎంఐలకు, స్వచ్ఛదనం పచ్చదనానికి ఖర్చు చేశాము. గ్రామాలలో నిధులు కొరత ఉన్నా సమస్యలు పరిష్కరించడానికి ఇబ్బందులు లేవు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు చేశారా?

గ్రామాల అభివృద్ధికి ప్రతీ ఏడాది ప్రణాళికలు తయారు చేస్తాం. 2024-25కు సంబంధించి అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేయిస్తున్నాం.

కార్యదర్శులపై పర్యవేక్షణ ఎలా ఉంది..?

జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు ఉన్నారు. ప్రతీ రోజు వారు ఉదయం గ్రామానికి చేరుకొని యాప్‌లో లోకేషన్‌తో ఫొటో క్యాప్చర్ పెట్టాలి. జూమ్‌కాల్‌లో వారితో ఎప్పటికప్పుడు మాట్లాడి పర్యవేక్షణ చేస్తున్నాం.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నారా...?

ఎలక్షన్ కమిషన్ అదేశాల మేరకు ఓటర్ల జాబితాను సిద్ధం చేయించాము. ప్రభుత్వం ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చిన నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

వేస్ట్ ఫిష్

- విచ్చలవిడిగా చేపల చెరువులు
- మేతగా చికెన్ వ్యర్థాలు, కుళ్లిన కోడి గుడ్లు
- ప్రజారోగ్యంతో చెలగాటం
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు



మండలంలోని ఓ గ్రామ శివారులోని చేపల చెరువులో వేసిన చికెన్ వ్యర్థాలు

ఎర్రవల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలో అనుమతులు లేకుండా చేపల చెరువుల సాగు విచ్చలవిడిగా సాగుతోంది. మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు ధనార్జనే ధ్యేయంగా ఎర్రవల్లి ప్రాంతంలో స్థిరపడి చేపల చెరువులను సాగు చేస్తుంటారు. ఈ దందా 15 సంవత్సరాలుగా కొనసాగుతోంది. ప్రధానంగా మండలంలోని తిమ్మాపురం, శేకుపల్లి, సాసనూల్, గార్లపాడు గ్రామ శివారుల్లో జరుగుతోంది. కొన్నిచోట్ల చెరువులు, ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసుకొని డబ్బులు సంపాదిస్తున్నారు. పంగస్ చేపలను సాగు చేస్తూ, వాటికి ఆహారంగా చికెన్ వ్యర్థాలను, కుళ్లిన కోడి గుడ్లు, జంతు కళేబరాలను వేస్తున్నారు. ఇటీవల కోళ్ల వ్యర్థాల రెండు వాహనాలను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.

పంగస్ ఫిష్ సాగు ఇలా

ఒక హెక్టార్‌లో పంగస్ రకం చేప పిల్లలను సుమారు ఐదువేలు వదులుతారు. వాటిలో నాలుగు వేల వరకు చేతికి వస్తాయి. ఇవి త్వరగా పెరిగేందుకు చికెన్ వ్యర్థాలు, కుళ్లిన కోడి గుడ్లు, పీడీఎస్ బియ్యాన్ని మేతగా వేస్తుంటారు. ఈ చేపలు పెంచటానికి కిలోకు రూ. 20 వరకు ఖర్చు వస్తుందని, సాధారణ చేపలు సాగు చేయాలంటే రూ.80 నుంచి 90 వరకు ఖర్చు అవుతున్నట్లు తెలిసింది. పంగస్ చేపలను హైదరాబాద్, ముంబాయి, బెంగూళూరు వంటి నగరాలకు సరఫరా చేస్తారని తెలిసింది.

ఏది వేసినా తింటాయి

చెరువులలో ప్రస్తుతం పంగస్ చేప సాగు అవుతోంది. అది ఎలాంటి ఆహారం వేసినా తింటాయి. అయితే అక్రమ విధానంలో సాగు చేసే పెంపకందారులపై చర్యలు తీసుకునేందుకు స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇది వరకు తమకు ఇవ్వలేదు.

- షకీలా భాను, జిల్లా మత్స్య శాఖ అధికారి

గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తాం

- ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



వనపర్తి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాల్లోని గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని ఆబ్కారీ, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా లంకల గోవర్దన్ సాగర్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే మేఘారెడ్డి అధ్యక్షతన పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. తాను గ్రాడ్యుయేట్ పూర్తి చేయడానికి హైదరాబాద్ అఫ్జల్ గంజ్‌లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. వనపర్తి జిల్లాలో ప్రతీ మండలంలో గ్రంథాలయాలను పండుగ వాతావరణంలో ప్రారంభించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి గ్రంథాలయాలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ చైర్మన్ లంకల గోవర్దన్ సాగర్ మాట్లాడుతూ... మనిషి మనో విజ్ఞానానికి గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అంతకుముందు రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షుడు రియాజ్ లంకల గోవర్దన్ సాగర్‌ను వనపర్తి జిల్లా గ్రంథాలయాల చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు.

● నల్ల చెరువులో చేప పిల్లలు విడుదల

జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక నల్ల చెరువులో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి 70వేల చేప పిల్లలను వదిలారు. ప్రభుత్వం చేపపిల్లలు ఉచితంగా ఇవ్వడంతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయాల అధ్యక్షుడు రియాజ్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మునిసిల్ వైస్ చైర్మన్ కృష్ణ, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, గ్రంథాలయ కార్యదర్శి మనోజ్, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో 87 కొత్త పోలింగ్ కేంద్రాలు

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం 793 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా ప్రతిపాదించిన 87 పోలింగ్ కేంద్రాలతో కలిపి మూడు నియోజకవర్గాల పరిధిలో 880 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన తదితర అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని, అందుకు సంబంధించిన మార్పులు, తొలగింపుల కోసం ఈ నెల 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. డిసెంబరు 24న మార్పులు తొలగింపులు, దరఖాస్తులను పరిష్కరించాలని, జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని తెలిపారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 11, అచ్చంపేట నియోజకవర్గంలో 61, కొల్లాపూర్ నియోజకవర్గంలో 15 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలను రూపొందించినట్లు ఆయన తెలిపారు.

అప్పాజిపల్లి అందరికి ఆదర్శం

-సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



పంచాయతీ కార్యాలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ

తిమ్మాజిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి అని అప్పాజిపల్లి గ్రామం అందరికి ఆదర్శమని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లిలో గురువారం దాతల సహకారంతో ఏర్పాటు చేసుకున్న 14సీసీ కెమెరాలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్, సీఐ కనకయ్య, ఎస్ఐ నరేందర్‌రెడ్డిలతో కలిసి ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. అంతకు ముందు నరసన్నగుట్టపై శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పలువురు ఎస్పీని సన్మానించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్‌చైర్మన్ రాందేవ్ రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతమ్మ, రాంచంద్రారెడ్డి, రమేష్ ఉన్నారు.

నేడు జోగుళాంబ గద్వాల జిల్లాకు ముగ్గురు మంత్రుల రాక

గద్వాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లాలో శుక్రవారం ముగ్గురు మంత్రులు రానున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రంథాలయం చైర్మన్‌గా నీలి శ్రీనివాసులు ప్రమాణ స్వీకారానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు అవుతున్నారు. ఉదయం కృష్ణవేణిచౌక్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ, బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు.. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు వారు తెలిపారు.

షాపింగ్ మాల్స్ సందడి

- షాపింగ్ కేంద్రంగా మహబూబ్‌నగర్ పట్టణం
- రాజధానికి దీటుగా ప్రముఖ షాపింగ్ మాల్స్
- అందుబాటులో అన్ని రకాల బ్రాండెడ్ దుస్తులు
- పోటాపోటీగా వెలుస్తున్న మార్ట్‌లు

ప్రముఖ మాల్స్, మార్ట్‌లతో పాలమూరు పట్టణం కళకళలాడుతోంది. షాపింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లే అవసరం లేకుండా అన్నీ లభిస్తున్నాయి. పెళ్లి, పేరంటం, ఇతర శుభకార్యాల సందర్భంగా షాపింగ్ చేసేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి జనం పాలమూరు బాట పడుతున్నారు. కుటుంబంతో కలిసి రోజంతా ఉత్సాహంగా షాపింగ్ చేస్తున్నారు. చెప్పులు, బ్రాండెడ్ దుస్తుల నుంచి బంగారు, వెండి ఆభరణాల వరకు అన్ని రకాలు అందుబాటులో ఉన్నాయంటూ పాలమూరు రా రమ్మని పిలుస్తోంది..

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి



పాలమూరులోని పలు ప్రముఖ మాల్‌లు

పెళ్లిళ్లు.. గృహ ప్రవేశాలు.. ఇతర శుభకార్యాలకు అవసరమైన షాపింగ్ ఒకప్పుడు పెద్ద సమస్యగా ఉండేది. దుస్తులు, బంగారు, వెండి ఆభరణాల కోసం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ తెలిసిన వారి ఇళ్లలోనే, బంధువుల ఇళ్లలోనే రెండు మూడు రోజులుండి షాపింగ్ పూర్తి చేసుకోవాల్సి ఉండేది. నగరంలో తమ వారు ఎవరూ లేకపోతే లాడ్జింగ్‌లలో బస చేయాల్సిందే. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. అన్ని రకాలుగా షాపింగ్‌లకు మహబూబ్‌నగర్ పట్టణం అడ్డాగా మారింది. హైదరాబాద్‌కు వెళ్లే అవసరం లేకుండా ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి షాపింగ్ కోసం జనం పట్టణానికే వస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వెలిసిన మాల్స్‌లో షాపింగ్ పూర్తి చేసుకుంటున్నారు. పట్టణంలోని ఏనుగొండ నుంచి వన్‌టౌన్ చౌరస్తా వరకు రహదారికి ఇరువైపులా కళ్లు జిగేల్‌మనేలా పెద్ద షాపింగ్ మాల్స్ వెలిశాయి. హైదరాబాద్‌లో ఉన్న ప్రముఖ మాల్స్ అన్నీ పాలమూరులోనూ ఏర్పాటయ్యాయి. గతంలో హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడి బహుళ అంతస్తుల షాపింగ్ మాల్స్‌ను చూసి అబ్బురపడిన వారు, ఇప్పుడవి మన వద్ద కూడా ఏర్పాటు కావడంతో ఉత్సాహంగా షాపింగ్ చేస్తున్నారు.

మాల్స్‌లో జనం సందడి

ప్రఖ్యాతి గాంచిన చెన్నై షాపింగ్‌మాల్, సీఎంఆర్ షాపింగ్‌మాల్, విశాల్‌మార్ట్, మ్యాక్స్, ట్రెండ్స్ పాలమూరులో ఏర్పాటయ్యాయి. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ కూడా త్వరలో రానున్నది. వాటిలో అన్ని రకాల బ్రాండెండ్ దుస్తులు, పట్టు, ఫ్యాన్సీ చీరలు లభిస్తుండటంతో పెళ్లి సందడి అంతా మాల్స్‌లోనే కనిపిస్తోంది. వధూ వరుల కుటుంబసభ్యులు, బంధువులు పాలమూరుకు వచ్చి రోజంతా నచ్చిన షాపింగ్ చేస్తున్నారు. గతంలో హైదరాబాద్‌కు వెళ్లాలంటే రెండు కార్లు అద్దెకు తీసుకోవాల్సి వచ్చేదని, అక్కడి భోజనం ఖర్చు కూడా తడిసి మోపెడయ్యేది. ఇప్పుడు స్థానికంగానే అన్ని రకాల మాల్స్ మార్ట్స్ ఏర్పాటు కావడంతో ఆ ఖర్చు చాలా వరకు తగ్గిపోవడంతో షాపింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రానున్న రోజుల్లో మరి కొన్ని మాల్స్ కూడా ఏర్పాటు కానున్నాయి. పెళ్లిళ్ల సందర్భంగా అవసరమైన బంగారు, వెండి ఆభరణాలు కూడా అన్ని రకాల డిజైన్లలో మాల్స్‌లో అందుబాటులో ఉంటున్నాయి. మలబార్ గోల్డ్ వంటి ప్రముఖ నగల దుకాణం కూడా ఇక్కడ ఏర్పాటు కావడం గమనార్హం.

నిత్యావసర సరుకులకు మార్ట్‌లు

నిత్యావసర సరుకుల కొనుగోలు సంబంధించి పలు ప్రముఖ కంపెనీలకు చెందిన మార్ట్‌లు కూడా మహబూబ్‌నగర్‌లో ఏర్పాటయ్యాయి. మార్ట్‌లకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లడం, షాప్‌లో కలియ తిరుగుతూ అవసరమైన వస్తువులు, సరుకులు ఎంచుకొని తీసుకోవడంపై ఆసక్తి చూపుతున్నారు. అయితే ఒక వస్తువు కోసం వెళ్తే.. అదనంగా మరో నాలుగు వస్తువులు కూడా తీసుకుంటున్నామని, దీంతో అనుకున్న దాని కన్నా ఎక్కువ ఖర్చు అవుతుందని మధ్య తరగతి కుటుంబీకులు అంటున్నారు. స్థానిక కిరాణా వ్యాపారులు కూడా మార్ట్‌లకు వెళ్లి హోల్‌సేల్‌గా సరుకులు తీసుకెళుతున్నారు. పాలమూరులో రిలయన్స్, నేషనల్ మార్ట్, గురు రాఘవేంద్ర, అలీస్‌మార్ట్, ఎవ్రీ డే వంటివి ఇప్పటికే ఉండగా, త్వరలో డీ మార్ట్ కూడా ఏర్పాటు కాబోతోంది.

మందుబాబుల కోసం లిక్కర్ మార్ట్

రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్‌లో ఎక్కువలో ఎక్కువగా రూ. మూడు వేల లిక్కర్ బ్రాండ్స్ మాత్రమే లభించేవి. ఇప్పుడు అన్ని రకాలు లిక్కర్ మార్ట్‌లలో లభిస్తున్నాయి. ఈ ఏడాది రెండు లిక్కర్ మార్టులు కూడా వెలిశాయి. వాటిలో రూ.25 వేల విలువైన మద్యం బ్రాండ్లు కూడా అందుబాటులో ఉంటున్నాయి.

బ్రాండెడ్ వస్తువులన్నీ ఇక్కడే

షాపింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పని లేకుండా పాలమూరులోనే అన్ని రకాల బ్రాండెడ్ దుస్తులు లభిస్తున్నాయి. దుస్తులతో పాటు షూ, చెప్పులు తదితర వస్తువులు కూడా ఇక్కడి మాల్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు హైదరాబాద్‌కు వెళ్లినా షాపింగ్ చేసే ఉత్సాహం మాత్రం లేదు. హైదరాబాద్‌లో ఉంటున్న మా ఫ్రెండ్స్ కూడా మహబూబ్‌నగర్‌కు వచ్చినపుడు ఇక్కడ షాపింగ్ చేసిన సందర్భాలున్నాయి.

- వేణు, మహబూబ్‌నగర్

జాతీయ స్థాయిలో రాణించాలి

- జోగులాంబ గద్వాల డీఈవో రవీందర్
- ముగిసిన రాష్ట్రస్థాయి లీగ్ కమ్ నాకౌట్ క్రికెట్ పోటీలు
- విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు



మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఈవో రవీందర్

గద్వాల అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ అన్నారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర లీగ్ కమ్ నాకౌట్ పోటీల ముగింపు కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంకిత భావం, క్రమశిక్షణతో క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు క్రీడల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన గుర్తు చేశారు. నేటి సమాజంలో యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర పరిశీలకుడు విజయ్‌పాల్, సూపరింటెండెంట్ రామకృష్ణారావు, కృష్ణయ్య, పీఈటీలు బీసన్న, నాగేష్‌బాబు, సతీష్, రజనీకాంత్, బషీర్, తిరుపతి, రాఘవేంద్ర, కోచ్ శ్రీను ఉన్నారు.

పోటీల వివరాలు

జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి లీగ్ కమ్ నాకౌట్ క్రికెట్ పోటీలు నాల్గవ రోజు గురువారం జరగాల్సిన సెమీ ఫైనల్స్, ఫైనల్ పోటీలు వర్షం కారణంగా రద్దయ్యాయి. లీగ్ దశలో ఎక్కువ మ్యాచ్‌లు గెలు పొందిన మహబూబ్‌నగర్ జట్టును రన్‌రేట్ ఆధారంగా ప్రథమ స్థానంలో నిలవడంతో ఫైనల్ విజేతగా ప్రకటించామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. కంబైండ్ రన్నర్స్‌గా హైదరాబాద్, రంగారెడ్డి జట్లను ప్రకటించారు. మూడో స్థానంలో నల్గొండ జిల్లా జట్టు గెలుపొందినట్లు తెలిపారు. గెలుపొందిన జట్లకు షీల్డ్, మెమొంటోలను అందజేశారు.

సీతాఫలం గుజ్జు రంగు మారకుండా చర్యలు



సీతాఫల్ యూనిట్ సిబ్బందితో విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజప్రభాకర్

నవాబ్‌పేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలమూరు రైతు డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని పోమాల్‌లో నిర్వహిస్తున్న సీతాఫల్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీతాఫలంకు అధిక మార్కెట్ ధర పొందాలంటే గుజ్జు రంగు మారకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంటు సీతాఫలం మొక్కలను నాటుకునే విధానంపై సూచనలు చేశారు. ధర ఎక్కువ పొందేందుకు అవసరమైన పరిశోధనలు చేపట్టాలని శాస్త్ర వేత్తలను ఆదేశించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారి రాజశేఖర్, డాక్టర్ పిడిగం సైదయ్య, పాలమూరు రైతు డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, శ్రీరామ్, ఆంజనేయులు, రాములు, గజేందర్‌గౌడ్, రఘు నందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్ వడ్లు దిగుమతి చేసుకోం..

- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి
- కొత్తకోటలో రాష్ట్ర రైల్ మిల్లర్ల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు



మాట్లాడుతున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి

కొత్తకోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం నుంచి దిగుమతి చేసుకోమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని ఓ హోటల్‌లో జిల్లా రైస్ మిల్లర్స్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. రైస్ మిల్లర్లు తమ ఆస్తులను తాకట్టు పెట్టి ప్రభుత్వం నుంచి దిగుమతి చేసుకున్న వడ్లను మిల్లులో ఆడించి బియ్యం అందిస్తున్నామన్నారు. వర్షాలకు తడిసిన వడ్లు కొనుగోలు చేస్తామని రైతులకు అభయం ఇస్తున్నట్లుగా, తడిసిన ధాన్యం కొనుగోలు చేసిన మిల్లర్లకు న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడం లేదన్నారు. వెనుకా, ముందు బియ్యం అందిస్తున్న మిల్లర్ల అందరిని ఒకేలా చూడడం సరికాదన్నారు. సత్సంబంధాలు కొనసాగిస్తున్న అధికారులు మా త్రం మిల్లర్లను దొంగలుగా చూపడం క్షమించ రానిదన్నారు. రైస్ మిల్లర్ల రాష్ట్ర అసోసియేషన్‌తో చర్చిలు జరిపి గతంలో ఉన్న సమస్యలు పరిష్కారానికి చర్యలకు హామీ ఇస్తూ ఖరీఫ్, యాసంగి సీజన్‌లో క్వింటా వడ్లకు ఎంత బియ్యం వస్తాయే తేల్చడానికి రైతులు, అధికారులు, రైస్ మిల్లర్లతో కమిటీ వేసి వారి నివేదిక మేరకు బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం ఒప్పుకోవాలన్నారు. అప్పుడే వడ్లు దిగుమతి చేసుకుంటామని లేకుంటే మిల్లు మూసుకుంటామని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి వెంకటరమణ, పలు జిల్లాల ప్రతినిధులు వెంకట నారాయణ, శ్రీనివాస్, సత్యం, కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, రమేష్‌శెట్టి, హర్ష, వెంక టోరెడ్డి, శీల అశోక్, చంద్రశేఖర్, మూర్తి, రామ లింగేశ్వర్, రామచంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు పైపైకి..

- బీర్నీస్ రూ.200, చిక్కుడు రూ.వంద
- అన్ని కూరగాయలు రూ.60-80



అమ్మకానికి ఉంచిన కూరగాయలు

మహబూబ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ఏం కొనాలన్నా రూ.వందల్లో ఉండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు పెరిగాయి. బీర్నీస్ కిలో రూ.200, చిక్కుడు రూ. వందకు చేరాయి. రూ.500 నోటు తీసుకెళితే ఐదు నుంచి ఆరు కూరగాయలు కూడా తెచ్చుకోలేని పరిస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు. బీర్నీస్ చికెన్‌తో పోటీపడుతోంది. చికెన్ కిలో రూ.220-230 ఉండగా అందుకు దరిదాపుల్లోనే బీర్నీస్ ఉండటం గమనార్హం. టమాట రూ. 60, క్యాప్సికమ్ రూ. 80, బీరకాయ రూ. 80, దొండకాయ రూ. 60 పలుకుతున్నాయి. విపరీత వర్షాల కారణంగా కూరగాయల సాగు దెబ్బ తినడంతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నా కొనుగోలుదారులను మాత్రం ప్రస్తుత ధరలు కలవరపెడుతున్నాయి.



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

ఆసుపత్రి, బస్టాండ్‌లే లక్ష్యం

- పార్కింగ్ చేసిన వాహనాలు, ప్రయాణికుల బ్యాగుల చోరీ
- సీసీ కెమెరాలు లేకపోవడంతో ప్రజలకు తప్పని తిప్పలు
- పోలీస్ గస్తీ పెరిగితేనే దొంగల బెడద నుంచి ఉపశమనం

మహబబూబ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఆసుపత్రికి వెళ్లేవారు వాహనాలు పోగొట్టుకుంటుండగా.. బ్యాగ్‌లతో ప్రయాణం చేసేవారి బ్యాగ్‌లను బస్టాండ్‌లో కత్తిరించి అందినకాడికి దొంగలు ఎత్తుకెళుతున్నారు. మహబబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి, మహబూబ్‌నగర్, జడ్చర్ల బస్టాండ్‌లు దొంగలకు అడ్డాగా మారుతున్నాయి. నిత్యం చోరీలు జరుగుతున్నా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆర్టీసీ నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండగా గస్తీ పెంచాల్సిన పోలీసులు నెపం సీసీ కెమెరాలపై నెట్టివేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

బస్టాండ్‌లే అడ్డాగా

మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో తరుచూ చోరీలు జరుగుతున్నాయి. దసరా సందర్భంగా ఊరెళ్లే హడావిడిలో ఉన్న ప్రయాణికుల బ్యాగులో నుంచి నగలను కాజేశారు. రెండ్రోజుల్లో మూడు చోరీలు జరగగా 29 తులాల బంగారు నగలు అపహరించారు. అంతకుముందు ఎన్నో చోరీలు జరిగినా వాటికి అడ్డుకట్ట వేయకపోవడంతో ప్రయాణికులకు శాపంగా మారుతోంది. ఊరెళ్లే హడావిడిలో ప్రయాణికులనే లక్ష్యంగా చేసుకుని తెలివిగా బ్యాగ్‌లలోంచి నగలను కాజేస్తున్నారు. కొందరు ఆపదలో బస్సులను ఎక్కుతున్న క్రమంలో.. బ్యాగ్‌లపై దృష్టి సారించని వారి నుంచి నగలు దోచుకెళుతున్నారు. జడ్చర్ల బస్టాండ్‌లోనూ గతనెల జరిగిన చోరీలో 30 తులాల బంగారు నగలు అపహరించారు. బస్టాండ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు నోటీసులు ఇస్తున్నా ఆర్టీసీ మాత్రం ఆదిశగా ప్రయత్నాలు చేయడం లేదు. సీసీ కెమెరాలుంటే దొంగలను సులువుగా గుర్తించేందుకు అవకాశం ఉండటంతోపాటు సీసీ కెమెరాలున్నాయన్న భయం కూడా వారిలో ఉంటుంది. వరుసగా చోరీలు జరుగుతుండటంతో పోలీసులు కూడా పికెటింగ్ లేదంటే గస్తీని పెంచాల్సిన అవసరం ఉంది. పోలీసులు బస్టాండ్‌ల బందోబస్తుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జనరల్ ఆసుపత్రిలో వాహనాల చోరీ

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఎంతో మంది ఆపదలో వస్తుంటారు. పార్కింగ్‌లో, ఆసుపత్రి ప్రాంగణంలో నిలిపిన ద్విచక్రవాహనాలతో పాటు ఆటోలు కూడా ఎత్తుకెళ్తున్నారు. చాలా మంది వాహనాలకు సరిగా తాళాలు కూడా వేయరు. ఇదే అదునుగా వాహనాలను అపహరిస్తున్నారు. నెలలో మూడు, నాలుగు వాహనాలు చోరీకి గురవుతున్నాయి.

కమ్యూనిటీ హాళ్లు నైపుణ్య కేంద్రాలుగా మారాలి

- లోక కల్యాణం కోసం మహనీయుల జననం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : కులాలకు సంబంధించిన కమ్యూనిటీ హాల్‌లు సమాజానికి నైపుణ్య కేంద్రాలుగా మారాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని మామిడిమాడలో కొత్తగా నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ముదిరాజులు విద్యా, విజ్ఞాన రంగాల్లో బలోపేతమై రాజకీయంగా చైతన్యవంతులు కావాలని అన్నారు. రాబోయే రోజుల్లో పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కమ్యూనిటీ హాళ్లలో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించే విజ్ఞాన బాండాగారాలుగా మారాలని అన్నారు. గ్రామాల్లో ఉండే వసతులను ప్రజలు సద్వినియోగం చేసుకుని అన్ని కుల సంఘాలతో సంఘీభావంగా ఉండాలని తెలిపారు. పండుగ సాయన్న, వాల్మీకి లాంటి మహనీయులు లోక కల్యాణం కోసం జన్మించారని గుర్తు చేశారు.

వాల్మీకి జయంతి వేడుకల్లో..

షాపూర్, పర్వతాపూర్‌లో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. షాపూర్‌లో కొత్తగా ఆవిష్కరించిన పండుగ సాయన్న విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, కృష్ణ నాయక్, సామ్యానాయక్, లక్ష్మయ్య, సాయిలు, కృష్ణయ్య, గొడుగు సత్యం, ఆంజనేయులు, తిరుపతయ్య, రంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలి
- కురుమూర్తి ఉత్సవాలపై జాతర మైదానంలో అధికారులతో సమీక్ష
- హాజరైన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి



సమీక్షకు హాజరైన వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు

చిన్నచింతకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాటు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఈనెల 31నుంచి నవంబరు 18 వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి స్వామి ఆలయ జాతర మైదానంలో ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ విజయేందిరబోయి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమ్మక్క, సారలమ్మల తరువాత జరిగే పెద్ద జాతర అని, ముఖ్యంగా ఉద్దాలోత్సవం రోజే మూడు లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని తెలిపారు. జిల్లాలోని పలు రూట్ల నుంచి ఆర్టీసీ సరిపడ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలని కోరారు. జాతరలో పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కోనేరులో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. అంకారోత్సవం, ఉద్దాలోత్సవం ప్రధాన ఘట్టాలని, ఇందులో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేయాలని తెలిపారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా పలు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి కేటాయించిన విధులను తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమైన రోజులలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఇది 24గంటల పాటు పని చేసే విధంగా షిఫ్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించాలన్నారు. సమస్యలు తలెత్తిన సమయంలో తక్షణమే కంట్రోల్ రూంకి తెలియజేయాలని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు తాగునీరు, పారిశుధ్యం, 24 గంటల విద్యుత్ సరఫరాపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కాకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ పోలీసు శాఖా తరుపున షీటీంలు ఏర్పాటు చేస్తామని, ఎలాంటి పొరపాట్లు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

న్యూస్ బాక్స్

అంబులెన్స్‌లో ప్రసవం తల్లీబిడ్డ క్షేమం

భూత్పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులు ఎక్కువవడంతో గర్భిణిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఈఎంటీ కాన్పు చేయించాడు. వివరాల్లోకి వెళ్లితే జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నారాయణ, అతని భార్య సునీతా సోరేన్ మండలంలోని కొత్త గ్రామ శివారులో ఉన్న ఓ పేపర్ మిల్లులో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. అయితే గర్భిణి సునీతా సోరేన్‌కు గురువారం సాయంత్రం పురిటి నొప్పులు వచ్చాయి. భర్త 108 అంబులెన్స్‌కు వెంటనే సమాచారం ఇచ్చారు. స్పందించిన సిబ్బంది వారున్న చోటుకు చేరుకున్నారు. ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లో ఉన్న ఈఎంటీ భాషా, పైలెట్ అంబులెన్స్‌ను ఆపి కాన్పు చేశారు. పండంటి బిడ్డాకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సొంత ఖర్చుతో బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోగా, పాత డీఈవో కార్యాలయంలో గల వృత్తి శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 25 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, వివరాలకు 9441565895 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్

పిడుగుపాటుతో ఇద్దరికి గాయాలు

అమ్రాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని వంగరోనీపల్లి సమీపంలో గురువారం సాయంత్రం పిడుగుపాటుతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టీకే లక్ష్మాపురం తండాకు చెందిన మధుకుమార్, కృష్ణ అనే యువకులు గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై అమ్రాబాద్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా, వంగురోనిపల్లి గ్రామ సమీపంలోకి రాగానే వర్షం పడటంతో రోడ్డు పక్కనున్న చెట్టు కింద ఆగారు. అదే సమయంలో పిడుగు పడటంతో ఇద్దరూ గాయపడ్డారు. వారిలో మధుకుమార్ స్పృహ తప్పి పడిపోవడంతో అతడిని 108 అంబులెన్స్‌లో అమ్రాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆత్మకూరు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలంలోని మేడపల్లి శివారులో రామన్‌పాడు రిజర్వాయర్‌కు సంబంధించిన సూపర్ కెనాల్ బ్రిడ్జి కింద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం 10 గంటల సమయంలో జూరాల సూపర్ కెనాల్ బ్రిడ్జి వద్ద పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చేపల వేటకు వెళ్లిన పిట్టల గోవర్ధన్ అనే వ్యక్తి చూసి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష సమాచారం అందించారు. ఈ విషయాన్ని ఆమె పోలీసులకు తెలపడంతో ఎస్‌ఐ నరేందర్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 35 నుంచి 45 ఏళ్ల వయసు ఉండొచ్చని, ముదురు ఆకుపచ్చ రంగు టీ షర్ట్, ఆకుపచ్చ అడ్డ పంచ ధరించి ఉన్నాడని ఆయన తెలిపారు. అతడు మూడు, నాలుగు రోజుల క్రితమే కాలువలో పడి ఉండొచ్చని, ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉందని చెప్పారు. ఆనవాలు తెలిపిన వారు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

ఇద్దరి బైండోవర్

ఆత్మకూరు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : పొలం విషయంలో గొడవ పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన లంకాల అంజనేయులు, కురువ జయరాములు మధ్య పొలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. వీరిద్దరిపై గతంలో కేసులు కూడా నమోదయ్యాయి. అయినా తరుచూ గొడవ పడుతుండటంతో బుధవారం వారిని డిప్యూటీ తహసీల్దార్ బి.ప్రసాద్ ముందు బైండోవర్ చేశారు. ఇకపై సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు.

వ్యక్తిపై కేసు నమోదు

ధరూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్‌ను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకట్రాములు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఆత్మకూరుకు వెళ్తూ నర్సందొడ్డి చౌరస్తా వద్ద ఆగింది. రోడ్డుకు అడ్డంగా ఆపారంటూ టాటా ఏస్ వాహనం డ్రైవర్ సయ్యద్ వసీం అనే వ్యక్తి బస్సు డ్రైవర్ చిన్నారెడ్డిని దుర్భాషలాడారు. చుట్టుపక్కల ఉన్న వారు సర్దిచెప్పినా వినలేదు. దీంతో బస్సు డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ రెడ్యానాయక్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని దుందుభీ వాగు నుంచి గురువారం అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా కంసానిపల్లి సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఇసుక రవాణాకు అనుమతి లేదని గుర్తించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ మొల్గర రాజుతో పాటు, యజమాని చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ధరూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఏఎస్‌ఐ వెంకట్రాములు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా మక్తల్ గ్రామానికి వెంకటి(42) ఆరు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రానికి వచ్చాడు. ఈ నెల 15వ తేదీన బహిర్భూమికి వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయాడు. గమనించిన స్థానికులు గాలించినా, మృతదేహం లభ్యం కాలేదు. దీంతో గురువారం ఉదయం గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులోనుంచి శవాన్ని వెలికి తీశారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.



తాగుడు.. ఊగుడు బంద్



మద్యపాన నిషేధానికి కృషి చేసిన నెహ్రూజీ యూత్ క్లబ్ సభ్యులతో అప్పటి నాగర్‌కర్నూల్ కలెక్టర్ శ్రీధర్ (ఫైల్)

- సింగోటం గ్రామంలో పదేళ్లుగా మద్య నిషేధం
- నెహ్రూజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్ణయం
- విక్రయాలను అడ్డుకునేందుకు యువ సైన్యం
- యువకులు, మహిళలు, నాయకుల సహకారం

'మందు బాబులం మేము మందు బాబులం.. మందు కొడితే మాకు మేము మహారాజులం.. కల్లు తాగి గంతేస్తాం.. సారా తాగి చిందేస్తాం' అంటూ తాగడం.. ఊగడం.. ఈ గ్రామంలో కుదరదు.. ఎందుకంటే ఇక్కడ పదేళ్లుగా మద్యపాన నిషేధం పక్కాగా అమలవుతోంది. అదే కొల్లాపూర్ నియోజకవర్గంలోని సింగోటం. గ్రామంలో మద్య పానాన్ని ఎందుకు నిషేధించారు.. అందుకు కారణాలు ఏమిటి.. ఏమి చర్యలు తీసుకున్నారు.. నిషేధాన్ని విజయవంతంగా ఎలా కొనసాగిస్తున్నారు.. తదితర విషయాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

- కొల్లాపూర్ (ఆంధ్రజ్యోతి)

కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రం సమీపంలో, లక్ష్మీ నరసింహస్వామి కొలువుదీరిన పుణ్యక్షేత్రం సింగోటం. గ్రామంలో నిత్యం కుటుంబ కలహాలు, భూతగాదాలు, రాజకీయ గొడవలు జరుగుతుండేవి. అందుకు మద్యపానమే మూల కారణమని గ్రామానికి చెందిన నెహ్రూజీ యూత్ క్లబ్ సభ్యులు గుర్తించారు. యువకులను సమీకరించి



మద్య నిషేధం బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న సింగోటం గ్రామ యువకులు (ఫైల్)

చర్చించుకున్నారు. మద్యం, సారా విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలో మహిళా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి మద్యపాన నిషేధానికి ఒప్పించారు. నెల రోజుల పాటు గ్రామంలో తిరిగి మద్యం, సారా విక్రయదారులందరికీ హెచ్చరికలు జారీ చేశారు. 60 బెల్టు షాపులు, 20 సారా దుకాణాలు, 40 లిక్కర్ షాపులను గుర్తించారు. యువకులందరూ ప్రైవేట్ సైన్యంగా మారి మద్యం, సారా విక్రయాలను అడ్డుకున్నారు. గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేశారు. మద్యం అమ్మరాదు.. తాగరాదని సంతకాలు సేకరించారు. అలా వారితో ప్రతిజ్ఞలు చేయించారు. శుభకార్యాలు, ఉత్సవాల సమయంలోనూ ఊరిలోకి ఎవరూ మద్యం తీసుకు రాకుండా చర్యలు తీసుకున్నారు. 2014, నవంబరు 22న మద్యం, సారా అమ్మకాలు నిషేధించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇలా నెహ్రూజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన మద్యపాన నిషేధం పదేళ్లుగా విజయవంతంగా కొనసాగుతూ, నియోజకవర్గంలోని ఇతర గ్రామాలకూ, ప్రజలకూ ఆదర్శంగా నిలిచింది.

సామాజిక సేవలో నెహ్రూ యువ కేంద్రం

నెహ్రూజీ యూత్ క్లబ్ సభ్యులు మద్యపాన నిషేధం అమలుతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. యువకులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. కరోనా విపత్తు సమయంలో గ్రామంలోని పేదలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు గ్రామంలో చందాలు సేకరించి పంపించారు. ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ నెహ్రూజీ యూత్ క్లబ్ సభ్యులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో క్లబ్ సభ్యులు కీలక పాత్ర పోషించారు. నిరసన దీక్షలు, సకల జనుల సమ్మె, పాదయాత్రలతో ఉద్యమాన్ని ఉధృతలూగించారు. అలాగే గత పదేళ్లుగా గ్రామంలో మద్యం, సారా విక్రయాలు జరగకుండా పట్టువదలని విక్రమార్కుల్లా కృషిని కొనసాగిస్తున్నారు. భవిష్యత్తులో కూడా మద్య నిషేధాన్ని పక్కాగా కొనసాగిస్తున్న అంటున్నారు.

యువకులమంతా ఏకమయ్యాం



సింగోటం గ్రామంలో నిత్యం జరుగుతున్న గొడవలకు మూల కారణం మద్యమే అని గుర్తించాం. నెహ్రూజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో యువకులం అంతా ఏకమయ్యాం. 2014, నవంబరు 22న మద్యం, సారా అమ్మకాలు నిషేధించాలని నిర్ణయం తీసుకున్నాం. నాటి నుంచి నేటి వరకు పదేళ్లుగా ఆ నిర్ణయాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం. అందుకు యువకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారు.

- చింతకుంట అశోక్, నెహ్రూజీ యూత్ క్లబ్ సభ్యుడు

మాతృదేవోభవ



కుమార్తెలు భార్గవి, లిఖిత, మాధురిలతో తల్లిదండ్రులు దేవేందర్, చంద్రకళ

- మంచానికే పరిమితమైన కుటుంబ పెద్ద
- కుటుంబానికి అన్నీ తానే అయిన చంద్రకళ
- చిన్న కిరాణం దుకాణమే జీవనాధారం
- వైద్య విద్యలో రాణిస్తున్న ముగ్గురు కుమార్తెలు

అమ్రాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ పెద్ద 15 ఏళ్ల కిందటే మంచానికే పరిమితమయ్యాడు. ఓ చిన్నపాటి కిరాణం కొట్టే ఆ కుటుంబానికి జీవనాధారమైంది. అయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఆ తల్లి అష్టోసొప్పో చేసి ముగ్గురు కుమార్తెలను వైద్య విద్య చదివి స్తోంది. ఆమె కష్టానికి ప్రతిఫలంగా ముగ్గురూ రాణిస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన గంజి దేవేందర్, చంద్రకళ దంపతులకు ముగ్గురు కుమార్తెలు న్నారు. వారు ప్రాథమిక విద్యాభ్యాసం చేస్తున్న సమయంలోనే తండ్రి అనారోగ్యం (వెన్నెముకకు గాయం కావడం)తో కదలలేని స్థితిలో మంచానికే పరిమి తమయ్యాడు. దీంతో చంద్రకళ 2008 నుంచి ఇంటి వద్దే చిన్న కిరాణం దుకాణం నిర్వ హిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. అలాగే ముగ్గురు కుమార్తెలను అమ్రాబాద్, అచ్చంపేట, హైదరాబాద్ ప్రాంతాల్లో ప్రాథమిక, ఉన్నత విద్య ను చదివించింది. పెద్ద కూతురు భార్గవి ఆంధ్ర ప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుంతకల్లులో బీఏఎంఎస్ పూర్తి చేసింది. రెండవ కూతురు లిఖిత నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్నది. మూడవ కూతురు మాధురి ఇటీవలే వరంగల్ జిల్లా నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్నది. తండ్రి తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టినా, ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నా.. వారు ముగ్గురు ఉన్నత విద్యాభ్యాసం చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

అప్పులతో సతమతం



ముగ్గురు కూతుళ్లను వైద్య విద్య చదివించడం కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. వారి భవిష్యత్తుకోసం చెప్పలేనన్ని బాధలు పడుతున్నాను. శ్రీనిధి మహిళా సంఘాల ద్వారా తీసుకున్న నాలుగు లక్షల రూపాయల అప్పుతో పాటు, బయట కూడా కొందరికి డబ్బు చెల్లించాల్సి ఉంది. మా వీధిలోనే మరో రెండు షాపులు ఏర్పాటు కావడంతో కిరాణం దుకాణం కూడా సరిగ్గా నడవడం లేదు. అనారోగ్యం పాలైన భర్తను ఇంట్లో వదిలిపెట్టి బయటకు పోలేను. ఏ పనీ చేయలేకపోతున్నాను. ప్రస్తుతం మా ఆర్థిక పరిస్థితి చెప్పుకోలేనంత ఇబ్బందిగా ఉంది.

- గంజి చంద్రకళ, అమ్రాబాద్

మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించా..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంతకల్ ఆయుర్వేదిక్ మెడికల్ కళాశాలలో బీఏఎంఎస్ చదివి, మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాను. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా బీఏఎంఎస్ లో 24 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కాగా, అందులో నేను కూడా ఉన్నాను. త్వరలో జాబ్ చూసుకొని, ఇద్దరు చెల్లెళ్ల చదువులకు అండగా ఉంటాను.

- డాక్టర్ భార్గవి, అమ్రాబాద్

అగ్రిమెంట్లు కావట్లే

(మొదటిపేజీ తరువాయి)

ఆడిస్తే 58 నుంచి 60 కిలోలు మాత్రమే వస్తాయని చెబుతున్నారు. ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీ మిల్లర్లతో రెండుసార్లు సమావేశం కాగా.. దొడ్డు రకాల మాదిరిగానే బియ్యం ఇవ్వాలని చెబుతోంది. అలాగే మిల్లర్లు ఏపీ, ఛత్తీస్‌గఢ్ మాదిరిగానే ఇక్కడ కూడా క్వింటా ధాన్యం ఆడిస్తే మిల్లింగ్ చార్జీలు రూ. 130 నుంచి రూ. 150 వరకు ఇవ్వాలని, ప్రస్తుతం కేవలం రూ. 10 మాత్రమే ఇస్తున్నారని చెబుతున్నారు. పదేళ్ల నుంచి ఇదే చార్జీలు ఇస్తున్నారని కేబినెట్ సబ్ కమిటీకి తెలియజేశారు. గతంలో ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్నప్పుడు రూ. 100 ఇవ్వాలని చెప్పినా ఇప్పటివరకు అమలు కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. అలాగే ప్రభుత్వం 25శాతం బ్యాంక్ గ్యారంటీలను ఇవ్వాలని చెబుతుండగా, దానికి మిల్లర్లు ఒప్పుకోకపోవడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటివరకు ఒక్క అగ్రిమెంట్ కూడా కాలేదు. ఏదో ఒక స్పష్టత రాకపోతే రైతులు ఇబ్బందులు పడతారు.

డీఫాల్ట్ పెడతారా...?

అసలే పలు డిమాండ్లతో వానాకాలం సీజన్‌లో ధాన్యం దిగుమతికి మిల్లర్లు ససేమిరా అంటున్నారు. ఈ నెలాఖరుకు సీఎంఆర్ అప్పగింతకు గడువు ముగియనుంది. అయినప్పటికీ వందల సంఖ్యలో మిల్లర్లు ఇంకా గత సీజన్ల సీఎంఆర్ అప్పగించలేదు. నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం కూడా కనిపించడం లేదు. ప్రభుత్వం మాత్రం సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న మిల్లులకు ధాన్యం ఇవ్వబోమని చెబుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో దాదాపు ఏడు మిల్లులు, వనపర్తి జిల్లాలో దాదాపు 110 మిల్లులు, నారాయణపేట జిల్లాలో 37 మిల్లులకు అత్యధికంగా సీఎంఆర్ పెండింగ్ ఉంది. అదే జరిగితే ఉమ్మడి పాలమూరులో వందకు పైగానే మిల్లులు డిఫాల్ట్ అయ్యే అవకాశం ఉంది. యాసంగితో పోల్చితే వానాకాలం ధాన్యం సేకరణ అధికంగా ఉంటుంది. గతంలో ఉమ్మడి జిల్లాలో సేకరణకు తగ్గట్లుగా మిల్లులు లేకపోవడంతో సంగారెడ్డి, మిర్యాలగూడ, సూర్యాపేట ప్రాంతాలకు తరలించేవారు. చాలా వ్యయప్రయాసలు పడేవారు. ఇప్పుడు ఒకవేళ సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లకు కేటాయించకపోతే.. ధాన్యం తరలించడం ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.



మహబూబ్‌నగర్ మార్కెట్‌యార్డ్‌లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు (ఫైల్)

ఆటోలోంచి ఎగిరిపడి యువకుడి మృతి

- మరో యువకుడికి స్వల్ప గాయాలు

చేవెళ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అతివేగం అజాగ్రత్తతో వాహనం నడపడంతో ఆటోలో వెనుకల ఉన్న యువకుడి ఎగిరి రోడ్డుపై పడి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం ఉదయం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసారం గేటు సమిపంలో చోటు చేసుకుంది. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం, మరికల్ గ్రామానికి చెందిన దున్న పోతుల శంకర్ (19) నగరంలో ఓ చేపల వ్యాపారి వద్ద పని చేస్తున్నాడు. నగరం చుట్టూ జరిగే సంతలలో చేపలు అమ్మేందుకు నిత్యం ఆటోలో వెళ్లేవాడు. అయితే గురువారం చేవెళ్ల మార్కెట్‌లో (సంత) చేపలు అమ్మేందుకు నగరం నుంచి ఆటోలు బయలుదేరారు. మార్గమధ్యలోని చేవెళ్ల మండల పరిధిలోని కేసారం గేటు సమీపంలోకి రాగానే ఆటో అతివేగంగా డ్రైవ్ చేయడంతో అదుపుతప్పింది దీంతో ఆటో వెనుకల ఉన్న శంకర్, రాములు ఎగిరి హైద్రాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై పడిపోయారు. అయితే శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాములకు స్వల్ప గాయాలతో బయపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

- వేగంగా వెళ్తుండగా ముంగీస చక్రంలో ఇరుక్కోవడమే కారణం

ఉప్పునుంతల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళ్తుండగా రోడ్డు పక్కనున్న పొదల్లోంచి వచ్చిన ముంగీస చక్రంలో ఇరుక్కొని అదుపు తప్పి కిందపడటంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని కోమటికుంట గ్రామానికి చెందిన షైబు గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు పక్కనున్న పొదల నుంచి ఒక ముగీస ముంగిస పరుగెత్తుకుంటూ వచ్చి, చక్రంలో ఇరుక్కుంది. దీంతో బైక్ అదుపుతప్పి షైబు కిందపడటంతో తలకు, చేతులకు గాయాలయ్యాయి. సమీప గ్రామానికి చెందిన వారు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడికి చేరుకొని అతడిని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

- జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రాజరాజేశ్వరి, మల్దకల్, జడ్చర్లలలో వేంకటేశ్వర స్వామి వివాహ వేడుక



గద్వాలలో రాజరాజేశ్వరి, భవనీ శంకరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గద్వాల టౌన్/ మల్దకల్/ జడ్చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భక్తమార్కండేయ స్వామి ఆలయంలో గురువారం రాజరాజేశ్వరీ దేవి, భవానీ శంకరస్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామివారి మూల విగ్రహం, ఉత్స వ మూర్తులకు అభిషేకం నిర్వహించి, చండీహోమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల వివాహ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి ఉభయదారులుగా మల్దకల్ దామ పార్వతమ్మ, శంకరయ్య దంపతులు, గద్వాల దూడెం సుమన, శ్రీనివాసులు దంపతులు వ్యవహరించారు. వేడుకలను తిలకించేందుకు పట్టణ ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు.

- పౌర్ణమి సందర్భంగా మల్దకల్‌లోని ఆదిశిలా క్షేత్రం స్వయంభువు లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పురస్కరించుకుని ఆలయ చైర్మన్ ప్రహ్లదరావు ఆధ్వర్యంలో ఆదిశిలావాసుడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, అలంకరణ సేవ చేసి, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణం చేశారు.

- జడ్చర్ల పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఆలయ పూజారి సుధీంద్రచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



జడ్చర్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

లక్కీడ్రా కేసులో ఐదుగురి రిమాండ్



నిందితులకు జైలుకు తరలిస్తున్న ఎస్‌ఐ పబ్బతి రమేశ్

చిన్నంబావి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో తిరుమలై ఎంటర్‌ప్రైజెస్ లక్కీడా స్కీ నిందితులు ఐదుగురిని రిమాండ్‌కు తరలించి నట్లు ఎస్‌ఐ పబ్బతి రమేశ్ తెలిపారు. లక్కీ డ్రా పేరుతో 2500 మంది సభ్యులను చేర్చుకున్నట్లు చెప్పారు. వారిలో 16 నెలల స్కీం కాల పరిమితి ముగిసిన సభ్యులు 716 మందిలో 433 మందికి బహుమతి కానీ, డబ్బులు కానీ చెల్లించలేదని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, స్కీం నిర్వాహకులు నిరంజన్, ఎండీ ఖాదర్ బాషా, బడికెల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ రంజిత్, తిరుమలేశ్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఆదేశం మేరకు గురువారం వారిని రిమాండ్‌కు తరలించారు.

న్యూస్ బాక్స్

యాపట్లలో కూలిన ఇల్లు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యాపట్ల గ్రామంలో పావనం శ్రీరాములుకు చెందిన ఇల్లు వర్షాలకు కూలింది. బాధితుని కథనం ప్రకారం వివరాలు.. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తన ఇల్లు బుధవారం రాత్రి పూర్తిగా కూలిం దని తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లినట్లు తెలిపారు. ఇంట్లోఎవరూ లేకపోవడం వల్ల ప్రమాదం తప్పిందని ఆయన అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ ఉప సర్పంచ్ అజయ్, ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి.జాంగీర్, కృష్ణగౌడ్, జెట్టి నరేష్, తిరుపతయ్య, శ్రీశైలం, బాలచందర్, సురేష్‌ు విజ్ఞప్తి చేశారు.

కేఎల్ఐ కాలువ పరిశీలన

వెల్దండ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతేపల్లి గ్రామ సమీపంలోని కేఎల్ఐ డీ 82 కాలువను గురువారం ఇరిగేషన్ డీఈ సమ్మయ్య పరిశీలించారు. కాలువకు గండ్లు పడకుండా చూస్తామని, సాగునీరు సక్రమంగా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నాయకులు కొండల్‌యాదవ్, బాలస్వామి, శ్రీశైలం ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మన్ననూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా అమలవుతున్న నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ పథకాన్ని చెంచులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మయ్య తెలిపారు. 18-59 ఏళ్ల లోపున్న కుటుంబ యజమాని మరణిస్తే సదరు కుటుంబ సభ్యులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఆర్డీవో కార్యాలయం నుంచి లబ్ధిదారుడి దరఖాస్తు నేరుగా సెర్ప్ కార్యాలయానికి వెళుతుందని, అక్కడ దరఖాస్తుల పరిశీలన అనంతరం లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో రూ.20 వేలు జమ అవుతాయని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

బల్మూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాణాల గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌పై వేటు పడింది. ఆయన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడినట్లు జూలై నెలలో సామాజిక తనిఖీల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆరోపణలు రావడంతో పీడీ అతనిపై విచారణ చేసి కలెక్టర్ ఆదేశాల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో రాఘవులు తెలిపారు.

రైతు భరోసా అందించాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్



మాట్లాడుతున్న కట్టా సుధాకర్

వంగూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసాపై ప్రభుత్వం ఊసెత్తడం లేదని, వెంటనే రైతులకు సాయం అందించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా సాయం నేటికీ అందక రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నా రని తెలిపారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాగి కొండల్‌రెడ్డి, సైదులు, ప్రవీణ్‌రెడ్డి, మల్లేష్, రాఘవేందర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్లాలు ఏర్పాటు చేయాలి

కోడేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలు పండించిన పంటల నూర్పిడి, ధాన్యం ఆరబెట్టేం దుకు కల్లాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సన్న, చిన్న కారు రైతులు తమ పంటల నూర్పిడికి కావాల్సిన స్థలం అనుకూలంగా లేకపోవడంతో దూర ప్రాంతాలకు తరలించడం, రోడ్ల వెంట ధాన్యం ఆరబెట్టడానికి తీసుకెళ్తూ వ్యయప్రయాసాలకు గురవుతున్నారన్నారు.

దసరా డబుల్ ధమాకా

- కొల్లాపూర్ ఆర్టీసీ బస్ డిపోకు రూ.2 కోట్ల 65 లక్షలు ఆదాయం

కొల్లాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ నేపథ్యంలో కొల్లాపూర్ ఆర్టీసీ బస్ డిపోకు డబల్ ధమాకా ఆదాయం సమకూరింది. 16 రోజుల పాటు కొనసాగిన స్పెషల్ బస్సుల ప్రయాణంలో ప్రయాణికుల నుంచి ఏకంగా 2 కోట్ల 65లక్షల ఆదాయం కొల్లాపూర్ డిపోకు సమకూరినట్లు డిపో మేనేజర్ ఉమా శంకర్ గౌడ్ స్పష్టం చేశారు. గురువారం డీఎం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. అందరికీ అభినందనలు తెలిపారు. సమావేశంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, కార్యాలయ సూపరింటెండెంట్ నజీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కల్వకుర్తి సమగ్రాభివృద్ధి

- నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.204 కోట్లు మంజూరు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కల్వకుర్తి నియోజకవర్గం సమగ్రంగా అభివృద్ధి జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ, పీఆర్ రోడ్ల అభివృద్ధికి రూ.204 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. 2018 ఎన్నికల్లో గత సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరలేదని అన్నారు. 2024 ఎన్నికల్లో తాను కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిచానని, గెలిస్తే ఈ ప్రాంతంలో రైతులకు సాగునీరు, రోడ్ల అభివృద్ధి, ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తానని ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నెరవేరుస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తిలో గత వారం రూ.43.33కోట్లతో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిచే శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. 2లక్షల లోపు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరుగుతుందని, ప్రతిపక్ష నాయకుల మాటలు ప్రజలు నమ్మరాదని కోరారు. అర్హులందరికీ రేషన్‌కార్డులతోపాటు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. త్వరలోనే మరో రూ.91కోట్లు మంజూరు కానున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

● త్వరలో కల్వకుర్తికి ఇంటిగ్రేటెడ్ గురుకులం : కల్వకుర్తికి ఇంటిగ్రేటెడ్ గురుకులం మంజూరు కాలేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొనడం సమంజసం కాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రెండవ విడతలో 48 గురుకులాలు మంజూరవుతున్నాయని, అందులో కల్వకుర్తి ఉంటుందని తెలిపారు. విలేకర్ల సమావేశంలో వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు షానవాజ్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రాంరెడ్డి, మోతీలాల్, ప్రభాకర్‌రెడ్డి, హనుమానాయక్, సంతుయాదవ్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, ఎజాస్, కాంగ్రెస్ నాయకురాలు కరేష్మాబేగం ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి : ఎమ్మెల్యే

వంగూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మద్దతు ధర కోసం రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని రంగాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మద్దతుధరతో పాటు రూ.500 బోనస్ అందజేస్తామని చెప్పారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఉల్లంపల్లిలో వాల్మీకి జయంతి వేడకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సీఈవో విష్ణుమూర్తి, పాండురంగారెడ్డి, బాలస్వామి, రమేష్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి, బక్కయ్య, సలేశ్వరం చంద్రమౌళి పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

- హాజరైన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- జిల్లాలో వాల్మీకి విగ్రహాలకు పూజలు చేసిన వాల్మీకులు



రాచాలపల్లిలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఆ సంఘం నాయకులు

కొల్లాపూర్/ పెంట్లవెల్లి/ ఊర్కొండ/ తిమ్మాజిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని వాల్మీకులు, ప్రజలు పూజలు చేశారు. పలుచోట్ల ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, కాంగ్రెస్ నియోజక వర్గ నాయకులు పగిడాల శ్రీనివాస్ హాజరై పూజలు చేశారు. మాజీ సర్పంచు నల్లపోతుల గోపాల్, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, పర్యాటక శాఖ జిల్లా అధికారి కల్వరాల నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామన్‌గౌడ్, భీంరెడ్డి, వాల్మీకులు రెడ్డి, రవి, రెడ్డిరాము, నల్లపోతుల సురేష్, గుట్టల శ్రీను, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, కురుమయ్య, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు. ● కొల్లాపూర్ మండలంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో రచ్చకట్ట వద్ద గల వాల్మీకి ఆలయంలో వాల్మీకి సోదరులు సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించగా మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సోదరులురెడ్డి సత్యం నాయుడు, బంగారి నాయుడు, కృష్ణమనాయుడు, రాము నాయుడు, రమేష్ నాయుడు, కురుమయ్య నాయుడు, అమ్మ నాయుడు, కురుమయ్య నాయుడు, పెద్ద వెంకట్, కాశీ, హమాలి మధు, వెంకటేష్, గాలెన్న నాయుడు, చిన్న వెంకటి, ఊసి నాయుడు పాల్గొన్నారు. అదే విధంగా కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు, నార్లాపూర్, సింగోటం, మొలచింతలపల్లి, కుడికిళ్ల, చింతలపల్లి, సోమశిల గ్రామాలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకి సోదరులు ఘనంగా నిర్వహించారు. ● ఊర్కొండ మండల కేంద్రంతో పాటు రాచాలపల్లిలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించా రు. వాల్మీకి చిత్రపటానికి, రాచాలపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో హరీష్, శేఖర్, సురేందర్, శ్రీకాంత్, ప్రశాంత్, చంద్రశేఖర్‌రాజు, శివ, సతీష్, అభిషేక్ పాల్గొన్నారు. ● తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజిపల్లిలో గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు శివాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో వాల్మీకి చిత్రపటానికి మాజీ సర్పంచ్ జల్లి తిరుపతమ్మ పాల్గొని పూజలు చేశారు. తిమ్మాజిపేటలో వాల్మీకి చిత్ర పటాన్ని వాహనంలో ఉంచి పెద్ద ఎత్తున యువకులు నృత్యాలు చేస్తూ జైశ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. గ్రామంలో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య, యశ్వంత్, సుందరయ్య, ఎల్లయ్య, స్వామి, మహేష్, జంగయ్య, హుస్సేనయ్య, లింగం, నాగరాజు, కృష్ణయ్య పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ

- ప్రత్యేక పూజలు చేసిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి



కొల్లాపూర్ రాజావీధి హనుమాన్ దేవాలయంలో నవగ్రహాలకు పూజలు చేస్తున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణంలోని రాజావీధి హనుమాన్ దేవాలయంలో మునిసిపల్ చైర్‌పర్సన్ రమ్యనాగరాజు దంపతుల ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న యంత్రప్రతిష్ఠనవగ్ర హాల శివలింగం విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవానికి గురువారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు దంపతులు మంత్రి జూపల్లిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

రామాలయంలో సామూహిక వ్రతాలు

కందనూలు : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామస్వామి దేవాలయంలో ఆశ్వయుజ మాసం పౌర్ణమి సందర్భంగా గురువారం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు 8మంది దంపతులతో సామూహికంగా భక్తులచే శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు రామాలయం ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. ప్రతీ నెల పౌర్ణమి రోజు వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ సభ్యుడు కందాడూ శ్రీనివాసచార్యులు, అర్థం రవీందర్, గొల్ల రాములు, టి.మల్లేష్, యాదగిరి, రమాదేవి, శారద, నేష నారాయణ, శివ, వేణుగౌడ్, బాలస్వామి, చారి, నరసింహగౌడ్, సాయిభక్తులు, నిత్య విష్ణు సహస్ర పారాయణం కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా కొమురం భీమ్ వర్ధంతి



మన్ననూరులో కొమురం భీమ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి

మన్ననూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో కొమురం భీమ్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి ఆధ్వర్యంలో అధికారులు కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల కోసం కుమురం భీమ్ చేసిన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప విద్యాధికారి శంకర్ నాయక్, ఐకేపీ ఏపీఎం లక్ష్మయ్య, ఐటీడీఏ ఏవో జాఫర్ హుసేన్, చెంచు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● బల్మూరు : గోండు బెబ్బులి కొమురం భీం వర్ధంతిని గురువారం కొండనాగులలోని గిరిజన బాలుర వసతి గృహం విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వసతి గృహ సంక్షేమ అధికారి పాలాది రాములు మాట్లాడుతూ విద్యార్థులందరూ కొమరంభీం పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు నాణ్యతగా పూర్తి చేయాలి

- మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ సత్యం

కల్వకుర్తిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) సీసీ రహదారి నిర్మాణ పనులు నాణ్యతగా పూర్తి చేయాలని మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. మునిసిపల్ పరిధిలోని 1వ వార్డు, 21వ వార్డుల్లో టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా సీసీ రహదారుల పనులను పరిశీలించి మాట్లాడారు. నిర్మాణం చేపట్టిన గుత్తేదారులు పనులను నాణ్యతగా, మన్నిక ఉండేలా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆయా వార్డుల్లోని ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షాహెద్, ఆయా వార్డుకౌన్సిలర్లు బాలు నాయక్, సైదులుగౌడు, ఇంజనీర్లు షబ్బీర్ అహ్మద్, శివ, ఇతర సిబ్బంది క్రాంతి, శేఖర్, సోహైల్, రవి ఆయా కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు

- ట్రాన్స్‌కో ఏఈ వీ. సూర్యంనాయక్

వెల్దండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వ్యవసాయానికి, గృహాలకు మెరుగైన విద్యుత్ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఏఈ వీ. సూర్యంనాయక్ బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఏదైనా విద్యుత్ సమస్యలు ఉంటే తక్షణమే సిబ్బందికి తెలియజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

మండలంలో వ్యవసాయ, గృహోపకరణ విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి ?

ఏఈ : మండలంలో 7880 గృహోపకరణ, 941 కమర్షియల్, 5647 వ్యవసాయ, 98 వీధిదీపాల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి.

గృహజ్యోతి పథకం ద్వారా ఎంత మంది లబ్ధిపొందుతున్నారు ?

సుమారు 9వేలకు పైగా లబ్ధిదారులు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 6100 మందికి ఈ పథకం వర్తిస్తుంది. మరో మూడు వేల మంది దరఖాస్తు చేసుకున్నా, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సాంకేతిక కారణాలతో అమలుకాలేదు. వీరికి పథకం గురించి అవగాహన కల్పిస్తున్నాం.

లోవోల్టేజీ సమస్యలను అధిగమించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

మండలంలో లోవోల్టేజీ సమస్యలను అధిగమించేందుకు ఇటీవల 30 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాం. అంతేగాక మెరుగైన విద్యుత్ కోసం మరో 25 ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతిపాదనలు పంపాము. కాలనీలలో 900 విద్యుత్ పోల్స్ అవసరమని గుర్తించాము. ప్రమాదకరంగా మారుతున్న ఐరన్ పోల్స్ స్థానంలో సిమెంటు స్తంభాల ఏర్పాటుకు 600 వరకు పోల్స్‌కై ప్రతిపాదనలు పంపాము. ప్రాధాన్యత క్రమంలో సమస్యలను అధిగమిస్తున్నాము.

పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లు ఏమైనా ఉన్నాయా ?

మండలంలోని పోతేపల్లి గ్రామంలో కొన్నేళ్లుగా 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పెండింగ్‌లో ఉంది. కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో సమస్య ఏర్పడింది. సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకుని వెళ్లాము. సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నాము. ఎక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

చేతి పంపుల వాడకంపై అవగాహన కలిగి ఉండాలి

-ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రావు

తాడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో తాగునీటికి సంబంధించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీరు అందించే వాటర్‌మెన్లు అన్ని విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తాగునీటి సరఫరాకు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వాటర్‌మెన్లకు నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రెండవ రోజు గురువారం చేతిపంపులపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా ప్రజలకు తాగునీటి సమస్య ఉండకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశాలపై ఈ శిక్షణ తరగతుల్లో వారిని సంసిద్ధులను చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ భరత్‌సింహారెడ్డి, ఏఈ శివశంకర్, జిల్లా ట్రైనర్ శంకర్, వాటర్‌మెన్లు పాల్గొన్నారు.

● బిజినేపల్లి : మానవ శరీరానికి అవసరమైన ఖనిజ లవణాలతో కూడిన స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ఎంపీవో నరసింహులు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ శిబిరం గురువారం రెండో రోజు నీటి నాణ్యతపై అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో కథలప్ప, మాస్టర్ ట్రైనర్ మైక్రో బయాలజిస్ట్ రమేష్, సిబ్బంది ఖదీర్, వాటర్‌మెన్‌లు భీమని రాము, కృష్ణయ్య, అమర్‌నాయక్, లక్ష్మయ్య ఉన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పాలియేటివ్ కేర్ దినోత్సవం



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో

కందనూలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పాలియేటివ్ కేర్‌లో ప్రపంచ పాలియేటివ్ కేర్ దినోత్సవాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ ముఖ్య అతిథిగా హాజరై పాలియేటివ్‌కేర్‌లో చికిత్స పొందుతున్న పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలియేటివ్ కేర్ అంటే ఉపశమన సంరక్షణ కేంద్రమని 24గంటల వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ దశరథం, డీపీవో రేణయ్య, రెడ్‌క్రాస్ సెక్రటరీ రమేష్‌రెడ్డి, యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, బ్లడ్ డొనేషన్ కన్వీనర్ రాజ్‌కుమార్, మెంబరు కృష్ణారావు, అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నాగర్‌కర్నూల్ జిల్లాలోని విద్య, వైద్య, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు మౌలిక సదుపాయాల కల్పనకు వివరాలను అందజేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సీతారామారావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో మౌలిక వసతులపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలలో ప్రాథమిక స్థాయిలో కావాల్సిన మౌలిక వసతులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వ హించడం చట్టరీత్యా నేరమని, ఈ విషయంలో భ్రూణహత్యలు నివారించి ఆడపిల్లలను రక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లింగనిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టం-1994పై కలెక్టర్ సమీక్షించారు.

పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

రైతులకు ఇబ్బందులు కలుగకుండా పత్తి పంటను కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో పత్తి కొనుగోలుపై అదనపు కలెక్టర్ సీతారామా రావు, సంబంధిత అధికారులు, ట్రేడర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని రకాల ఏర్పాట్లను చేసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ సర్దార్ స్వరణ్‌సింగ్, జిల్లా వ్యవసాయ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారు లు, జిన్నింగ్ మిల్లు యజమానులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో పాఠశాల తనిఖీ

కందనూలు : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులను అత్యుత్త మంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేట్ ప్రమాణాల స్థాయిలో నాణ్యమైన విద్యాబోధన అందించాలని కలెక్టర్, ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు గణిత కూడికలు, తీసివేతలు, గుణకారం వంటి పరిక్రియలు బోర్డుపై రాసి విద్యార్థులను పరీక్షించారు. మంతటి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను డీఈవో గోవిందరాజులుతో కలిసి తనిఖీ చేశారు. నిర్మాణ దశలో ఉన్న స్కూల్ భవనాన్ని పరిశీలించారు.

విద్యార్థినులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, విద్యార్థినీలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని జిల్లా షీటీమ్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని కల్వకోల్ గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో షీటీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రయాణంలో ఉన్నప్పుడు ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించాలని ఆమె వివరించారు. సమాజంలో మహిళలు, బాలికలు తెలిసిన వారితోనే ఎక్కువగా వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. వేధింపులకు గురైతే షీటీమ్‌ను సంప్రదిస్తే ఆకతాయిల ఆట కట్టించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భరోసా కో ఆర్డినేటర్ శ్రీలత, షీటీమ్ బృందం సభ్యులు వెంకటయ్య, ఎస్‌వీకే సభ్యుడు తిరుపాల్, హెచ్‌ఎం ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు ఘన సన్మానం

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోవర్ధన్‌సాగర్‌ను పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రానికి చేరుకుని గోవర్ధన్‌సాగర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు దండు నరసింహ, డి.రవి కుమార్, బద్యానాయక్, ప్రతాప్‌రెడ్డి, రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ రాంలాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల చంద్రయ్యయాదవ్, యువ నాయకులు చిత్రనాథ్ పాల్గొన్నారు.

బీసీ కుల గణన పక్షపాతం లేకుండా నిర్వహించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిర్వహించే బీసీ కులగణన ప్రభుత్వం పక్షపాతంగా నిర్వహించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాష్ట్రంలో నిలిపివేసే వరకు పోరాటాలు చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్టీ, ఎస్సీ కులాల గణనతో పాటు రాష్ట్రంలో ని సబ్బండవర్గాల సమగ్ర సర్వే నిర్వహిస్తేనే సంపూర్ణ సమాచారం లభ్యమవుతుందన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దన్నోజు అరవింద్‌చారి, గొడుగు రాజు, శం కర్, మౌలానా, నవీన్, మధు పాల్గొన్నారు.

'మాలల హక్కుల కోసం న్యాయ పోరాటం చేస్తాం'

కొల్లాపూర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : మాలల హక్కుల కోసం న్యాయ పోరాటం చేస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ డాక్టర్ చెన్నయ్య పేర్కొన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి మాలల ఆత్మగౌరవ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. దళితులను చీల్చే కుట్ర సరికాదన్నారు. ఈనెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించే మాలల ఆత్మ గౌరవ సభకు కొల్లాపూర్ నియోజకవర్గంలోని మండలాల వారీగా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కుటుంబ మాలలు మాల ఉద్యోగులు మాల యువతీ యువకులు అందరు సతీ సమేతంగా ఆత్మ గౌరవ సభకు హాజరై విజయవంతం చేయాలని నియోకవర్గ కన్వీనర్ బిజ్జ దేవదాసు పిలుపునిచ్చారు.

బీటీ రోడ్లకు నిధుల మంజూరుపై హర్షం

బల్మూరు/ వెల్దండ/చారకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు కృషి చేసిన అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డికు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బల్మూరు మండలం రామాజీపల్లి-బల్మూరుకు రోడ్డుకు మూడు కోట్లు విడుదల కావడంపై మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య హర్షం వ్యక్తం చేశారు. వెల్దండ మండలం తిమ్మినోనిపల్లి నుంచి రాచూరు తండా వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరైనందున మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, రాజనర్సింహ, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఊర్కొండ మండలం రాచాలపల్లి నుంచి మాదారం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రెండు కోట్లు మంజూరు కావ డంతో ఆయా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.